క్లుప్తంగా

ఇళ్లస్థలాల మంజూరుకు వినతి

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్పందనలో మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. వాటిలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రెండు, గ్రామ పంచాయతీకి సంబంధించిన సమస్య పరిష్కరించాలని ఒక అర్జీ వచ్చాయన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే.బాలశంకరరావు, హౌసింగ్ ఏఈ ఎ.నరసింహారావు, ఏపీఎం కోట భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

హైవే పక్కన కంపచెట్ల తొలగింపు



కంచికచర్ల: స్థానిక చెరువుకట్ట సమీపంలో నేషనల్ హైవే పక్కన జేసీబీ సాయంతో దట్టంగా పెరిగిన కంపచెట్లను సోమవారం తొలగించే కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి కనగాల రవికుమార్ ఈ పనులను పరిశీలించారు. హైవే పక్కన 700 మీటర్ల మేర కంపను రూ.38 వేలు ఖర్చుచేసి తొలగిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రి బీ.భూషణం, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

లక్ష తులసీ దళాల పూజ

పెనుగంచిప్రోలు: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామంలో శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామికి లక్షతులసీ పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం రంగాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

370 కోడి కత్తులు స్వాధీనం

మైలవరం: స్థానిక హాజీపేటలో కోడి పందేలకు ఉపయోగిస్తున్న 370 కత్తులను స్థానికుడు మాగిశెట్టి రామకృష్ణ వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రమేష్ తెలిపారు. మైలవరం పీఎస్‌లో సోమవారం ఏసీపీ రమేష్ మాట్లాడుతూ డివిజన్‌లో కోడి పందేలు, పేకాడే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. సీఐ రమేష్, ఎస్సై రాంబాబు పాల్గొన్నారు.

అండర్-15 బాలికల క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా జస్రామెహెక్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఏపీ అండర్-15 బాలికల క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా కొండపల్లి డీపీవీ పాఠశాల పదో తరగతి విద్యార్థిని జస్రామెహెక్ ఎంపికైంది. గతంలో ఎన్‌సీసీ క్యాడెట్‌గా ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఎన్టీటీపీఎస్, పాఠశాల యాజమాన్యం క్రికెట్‌లో ప్రోత్సహించారు. క్రికెట్‌లో ప్రతిభ చాటుతూ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడంపై పాఠశాల ఇన్‌చార్జ్ ఏహెచ్ఎం డి.ఇందిరాప్రియ, పీఈటీ వి.రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎల్బీఆర్సీఈ విద్యార్థినులు

మైలవరం: 26వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినిలు ఎస్.ఊహాజాహ్నవి, మీనామహిత ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ 26వ నేషనల్ యూత్ ఫెస్టివల్ ఈ నెల 12 నుంచి 16 వరకు భారతదేశ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కర్నాటక హుబ్లీలోని ధార్వాడ్‌లో జరుగుతాయన్నారు. దీనికి రాష్ట్రం నుంచి 12 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేయగా తమ కళాశాల నుంచి ఇద్దరు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. వీరిద్దరిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, డీన్స్, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి. శివహరిప్రసాద్ తదితరులు అభినందించారు.

వివేకానందుని బోధనలు ముందు తరాలకు అందించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారతీయ యువతను అద్భుతంగా ప్రభావితం చేసిన స్వామి వివేకానందుని బోధనలు, భావాలు ముందు తరాలకు అందించాలని ఏపీ మైనారిటీ శాఖ ముఖ్యకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నలంద డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ సేవకులకు స్వామి వివేకానంద స్ఫూర్తి అవార్డులను అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ తొలుత వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక సాంప్రదాయాలతో పాటు, వివేకానందుని విశాల దృక్పథమే ఆయన రచనలు, ఉపన్యాసాలలో ప్రతిఫలిస్తుందన్నారు. వెంకటేశ్వరరావు(విజయవాడ), డి ఆంజనేయప్రసాద్(హైదరాబాద్), ఎస్ రవీంద్రారెడ్డి (పలమనేరు), వై శ్రీలక్ష్మి(విజయవాడ), షేక్ రఫీయాబేగం(విజయవాడ)ను సత్కరించి అవార్డులు అందజేశారు. వేముల హజరత్తయ్య గుప్తా, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేన్ అధ్యక్షుడు కె మురళీమోహన్‌రాజు, ప్రిన్సిపాల్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిన 'ప్రజాసంకల్ప యాత్ర'

ప్రభుత్వ విప్ ఉదయభాను



మాట్లాడుతున్న, పభుత్వ విప్ ఉదయభాను, పక్కన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర పూర్తయి నేటికి 4 ఏళ్లు అయిన సందర్భంగా సోమవారం స్థానిక కోదాడ రోడ్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి ఉదయభాను పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. యువకులు బాణా సంచా కాలుస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల్లోనే ప్రజా సంకల్పయాత్ర ఓ సంచలనం, చరిత్రాత్మకం అన్నారు. మళ్లీ రాజన్న రాజ్యాన్ని తీసుకురావాలన్న సంకల్పంతో వైఎస్సార్ జిల్లా ఇడుపుల పాయలో వైఎస్.రాజశేఖర రెడ్డి సమాధి వద్ద 2017 నవంబర్ 6న చేపట్టిన ఈ పాదయాత్ర 2019 జనవరి 9 న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు సాగిందన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకొని నవరత్నాలుగా మార్చి ప్రజలకు అందించారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పినవి, చెప్పని వాగ్దానాలు కూడా అమలు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నిరంతరం దూషిస్తున్నా పట్టించుకోకుండా, కరోనా కష్టకాలంలో సైతం నిరంతరం సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. మరలా 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు పట్టం గట్టనున్నారని చెప్పారు. ఈ పాదయాత్రను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఇక్కడ ఉదయభానును ఎమ్మెల్యేగా గెలిపించి, అక్కడ వైఎస్ జగన్‌ను మరలా సీఎంను చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, గింజుపల్లి వెంకట్రామయ్య, తన్నీరు నాగేంద్ర, ఖాదర్‌బాబు, పార్టీ మైనార్టీ, మహిళ, ఎస్టీ, ఎస్సీ, బీసీ విభాగాల అధ్యక్షులు మొహిద్దీన్, ముసిని రాజ్యలక్ష్మి, బద్దూనాయక్, పరంధామ, గుంజ లక్ష్మణ్, షాదీఖానా చైర్మన్ ఎక్బైడ్ బాషా, నాయకులు ఫిరోజ్‌ఖాన్, నంబూరి రవి, దువ్వల రామకృష్ణ, పూసాల పుల్లారావు, చిరంజీవి, బాలస్వామి పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఫర్నిచర్ ఎగ్జిబిషన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కోరారు. స్థానిక ఉక్కు కళా వేదికలో శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి (కాపు సంఘం) మాజీ అధ్యక్షుడు చిట్టిప్రోలు సత్యనారాయణకు చెందిన సాయి ఎంటర్‌ప్రైజెస్, శ్రీసాయి ఫర్నీచర్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన ఫర్నీచర్ ఎగ్జిబిషన్‌ను సోమవారం ఉదయభాను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల రక్తదానం



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): విద్యతో పాటు సామాజిక సేవలో కూడా విద్యార్థులు పాల్గొనాలని ఎస్‌జీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి రవికుమార్ పేర్కొన్నారు. గ్రామంలో నాలుగు రోజులుగా కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో భాగంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు క్షేత్ర స్థాయిలో వివరిస్తున్నారన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు వివరిస్తున్నారని చెప్పారు. విజయవాడ రెడ్‌క్రాస్ సిబ్బంది రక్తం సేకరించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట అర్బన్): మండలంలోని చిల్లకల్లు గ్రామంలో జగ్గయ్యపేటకు చెందిన విశ్వభారతి జూనియర్, డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం నిర్వహించారు. తహసీల్దార్ నాగేశ్వరరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మొదటి రోజున ఎంపీడీవో కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. విశ్వభారతి విద్యా సంస్థల కరస్పాండెంట్ కే.పద్మశేఖర్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జల్లా తిరుపతిరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు తిరుపతిరావు, సవిత, ప్రైవేటు స్కూల్స్ పేట డివిజన్ అధ్యక్షుడు కొమరగిరి భరద్వాజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘాలన్నీ సంఘటితం కావాలి

ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముల్లర్



నూతన కమిటీతో ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముల్లర్

నందిగామ: సువార్తికులు ఐక్యత కలిగి ప్రజల క్షేమం కోసం ప్రార్థనలు చేయాలని నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొక్కా జార్జిముల్లర్ (నాని) సూచించారు. మండల పరిధిలోని చందాపురం గ్రామంలో హోరేబు ప్రార్థన మందిరంలో దైవ సేవకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ముల్లర్ మాట్లాడుతూ సేవకులు ఐక్యత కలిగి ఉండటం ఎంతో ముఖ్యమన్నారు. సంఘాలన్నీ సంఘటితంగా ప్రార్థిస్తే అద్భుత కార్యాలు జరుగుతాయని, ఎవరికి వారే అన్నట్లు కాకుండా సువార్తికులు ఐక్యంగా ఉంటూ సంఘాలను కూడా అదే బాటలో నడపాలన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొలు బాబు, ప్రధాన కార్యదర్శిగా అరిగెల ఎజ్రా, కోశాధికారిగా కృపాసముద్రం, గౌరవాధ్యక్షుడిగా రాంబాబు, ఉపాధ్యక్షులుగా రమేష్, థామస్, సంయుక్త కార్యదర్శులుగా రాజు, జీవన్, సహాయ కోశాధికారిగా బోయజు ఎన్నికయ్యారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

నందిగామ: జాతీయ రహదారి, ఇతర రహదారుల్లో ప్రమాదాలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపారు. మండల పరిధిలోని శనగపాడు రహదారిలో ప్రమాదకరమైన మలుపుల వద్ద రహదారి సరిగా లేకపోవడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ మేరకు స్పందించిన ఎస్‌హెచ్‌ఓ సతీష్ సోమవారం రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, కంప చెట్లను తొలగించడంతోపాటు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వీటికితోడు గుంతలను తాత్కాలికంగా మట్టితో పూడ్చారు. ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

నూజివీడు: యువత జూదాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ సూచించారు. స్థానిక డీఏఆర్ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను సోమవారం సబ్‌కలెక్టర్ ప్రారంభించారు. తహసీల్దార్ డీవీఎస్ ఎల్లారావు, రూరల్ ఎస్సై రామకృష్ణ, పీడీలు పాల్గొన్నారు.

ముసునూరు: క్రీడలతో దేహదారుఢ్యంతోపాటు, మానసిక ఉల్లాసం కలుగుతాయని తహసీల్దార్ దాసరి సుధ అన్నారు. స్థానిక రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను అధికారులతో కలసి ఆమె ఆరంభించారు. ఎస్సై ఎం.కుటుంబరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జూద క్రీడలు వద్దు – సంప్రదాయ క్రీడలు ముద్దు కార్యక్రమంలో భాగంగా కబడ్డీ పోటీలను పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్సై చంటిబాబు, ఏఎస్సై నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో దివ్యాంగ్ జన్ రైల్వే కన్సెషన్ ఐడీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ కమర్షియల్ విభాగం దివ్యాంగ్ జన్ రైల్వే రాయతీకి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారుల కోసం వెబ్ ఆధారిత 'దివ్యాంగ్ జన్ రైల్వే కన్సెషన్ ఐడి కార్డు సిస్టం'ను అభివృద్ధి చేశారు. డిసెంబర్ 22న డివిజన్ వార్షిక తనిఖీల్లో తెనాలి–గూడూరు సెక్షన్ల మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రారంభించారు. ఐడీ కార్డు కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు పూర్తి చేసి, సంబంధిత ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయడం ద్వారా ఐడీ కార్డు సులభంగా పొందవచ్చు. దివ్యాంగుల విలువైన సమయం, భౌతిక ప్రయాణాన్ని తగ్గించడంతో పాటు సులభంగా ఐడీ కార్డులు పొందవచ్చని సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు తెలిపారు. అప్లికేషన్ రూపొందించిన డివిజన్ ఐటీ ఉద్యోగులను డీఆర్ఎం శివేంద్రమోహన్ అభినందించారు.

విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

చాట్రాయి: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ఎస్ఎస్ఏ కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి రవీంద్ర పేర్కొన్నారు. మండలంలోని చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌ని సోమ వారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, జగనన్న విద్యాకిట్ల పంపిణీ, విద్యార్థుల ప్రతిభ అంశాలపై హెచ్ఎంని ఆరా తీశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

నూజివీడు: స్పందనలో వచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దని సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ హెచ్చరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనలో మొత్తం 15 అర్జీలు రాగా, వాటిని సంబంధిత అధికారులకు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ విద్యాసాగర్, ఐసీడీఎస్ సీడీపీఓ శేషుకుమారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంపలగూడెం: సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమమని ఎంపీడీఓ పిచ్చిరెడ్డి అన్నారు. గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజలు వ్యక్తిగత సమస్యలపై రెండు అర్జీలు ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈ కిషోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి, ఐకేపీ ఏపీఎం నాగరాజు పాల్గొన్నారు.

ఎ.కొండూరు: స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్‌చాట్ల వెంకటేశ్వర్లు తెలిపారు. చీమలపాడు నుంచి పట్టాదారు పాసు పుస్తకం మంజూరుకు అర్జీ అందినట్లు తెలిపారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి జైలు

విజయవాడ స్పోర్ట్స్: దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.సత్యవతి సోమవారం తీర్పు చెప్పారు. విజయవాడ కొత్తూరు తాడేపల్లిలోని తాళం వేసి ఉన్న ఇంట్లో ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన భూక్యా రామచంద్రరావు గత ఏడాది జూలై 18వ తేదీన దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత కొత్తపేట స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి రెండు రోజుల తరువాత నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ. 7 వేలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఎనిమిది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు రామచంద్రరావుకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, రైతాంగ హక్కుల సాధనకు ఏప్రిల్ 5వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐకేఎస్) అఖిల భారత నాయకుడు విజ్జు కృష్ణన్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏపీ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చలో ఢిల్లీ విజయవంతానికి రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఆరోపించారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అరికట్టకపోతే దేశ భవిష్యత్తే ప్రమాదం ముంచుకొస్తుందన్నారు. హక్కుల సాధన కోసం ఢిల్లీలో ఏప్రిల్ 5న జరిగే మహాప్రదర్శన, నిరసన సభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా సదస్సు పలు తీర్మానాలు చేసింది. సదస్సులో సీఐటీయూ నాయకుడు ఎం.ఎ.గఫూర్, ఏఐఏడబ్ల్యూయూ నాయకుడు బి.వెంకట్ మాట్లాడారు.

విజయమే లక్ష్యంగా సంఘటితంగా పని చేయండి

రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అయోధ్య రామిరెడ్డి, మర్రి, జగన్‌మోహనరావు, అరుణ్ కుమార్

నందిగామ టౌన్: పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. యువకులు, కార్యకర్తల మనోభావాలు, సాధక బాధకాలు తెలుసుకునేందుకే నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక మోహనరావు అధ్యక్షతన స్థానిక శ్రీకరం కల్యాణ మండపంలో సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో విజయం చేకూర్చిన కార్యకర్తలు, నాయకుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కారానికి కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి పార్టీకి విజయాన్నందించే బాధ్యత కూడా మీ భుజ స్కందాలపై ఉందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి పాలన సాగించే సమయానికి కరోనా రావటంతో ఏడాది కాలం వృథా అయిందన్నారు. అన్ని రంగాల నుంచి వచ్చే ఆదాయం తగ్గటంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయని వాటన్నింటిని అధిగమిస్తూ వచ్చామన్నా తెలిపారు.

నిరుత్సాహ పడాల్సినవసరం లేదు : మర్రి రాజశేఖర్..

సచివాలయ వ్యవస్థ తనంతటగా తాను పని చేయటంతో తమకు సరైన ప్రాధాన్యత లేకుండా పోయిందని నాయకులు ఆవేదన చెందుతున్నారని జిల్లా పార్టీ పరిశీలకుడు మర్రి రాజశేఖర్ అన్నారు. కానీ ఆ పని మన ప్రభుత్వమే చేస్తుందని సొంతం చేసుకోవాలని తెలిపారు. ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్టీసీ రీజనల్ చైర్మన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ సంఘటితంగా పని చేసి రానున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు.

సమస్యలు, ఇబ్బందులను తెలపాలి : ఎమ్మెల్సీ

స్థానికంగా సమస్యలుంటే పరిశీలకుల దృష్టికి తీసుకువెళ్తే పరిష్కారానికి వీలు కలుగుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాలుగు మండలాల కన్వీనర్లు, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు

నగర పంచాయతీ కమిషనర్ జయరాం



నందిగామ: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయని, ఇందులో ఎటువంటి సందేహాలకు తావు లేదని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అర్హత ఉంటే ఎటువంటి పైరవీలతో నిమిత్తం లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కూడా అర్హత ఉన్న అందరికీ అందాయని, వాటిలో నిర్మాణాలు కూడా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. కొన్ని టెక్నికల్ సమస్యల కారణంగా మాత్రమే కొందరికి ఇల్లు మంజూరు కాలేదని, అటువంటి వారు సంబంధిత సమస్యలు పరిష్కరించుకోగానే ఇల్లు మంజూరు అవుతాయన్నారు. గూడులేని ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కూడా పెద్ద ఎత్తున సమకూర్చిందని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారికి దఫాలుగా సొమ్ము కూడా జమ చేస్తున్నట్లు చెప్పారు.

ప్రజల సహకారంతోనే పారిశుద్ధ్యం మెరుగు

నందిగామ: నగర పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని 5వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను సోమవారం ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. చెత్తను రహదారులపై నిర్లక్ష్యంగా పడవేయకుండా పారిశుద్ధ్య సిబ్బంది వచ్చినప్పుడు అందజేయాలన్నారు. ప్రజల సహకారంతోటే పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవచ్చని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి 144 సెక్షన్ అమలు

తహసీల్దార్ లక్ష్మీకల్యాణి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్, పక్కన ఎస్ఐ, తదితరులు

పెనుగంచిప్రోలు: జూదాలను నియంత్రించాలని తహసీల్దార్ కే.లక్ష్మీకల్యాణి ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 17 వరకు 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, కోడి పందేలు, గుండాట, జూదం మొదలకు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, పశువైద్యాధికారి అనిల్, ఏఓ సిద్దారెడ్డి, ఈఓపీఆర్డీ వీరభద్రరావు, గ్రామ కార్యదర్శులు, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విమలాభాను, హఫీజున్నీసా తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా విభాగం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విమలాభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రచారం చేయాల్సిన బాధ్యత మహిళా విభాగంపై ఉందని, అందుకు ప్రతి మహిళ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు ముసిని రాజ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా, మాజీ కౌన్సిలర్లు తుమ్మల నాగమణి, షేక్ హబీబా, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు షేక్ మునిహేరా, మెప్మా సీవో నిర్మల, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో తెగుళ్ల నివారణపై అవగాహన

చాట్రాయి: మొక్కజొన్న పైరుకి ఆశించే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారి బి.శివశంకర్ అన్నారు. సోమవారం చాట్రాయి గ్రామంలో మొక్కజొన్న పైరును ఆయన పరిశీలించారు.

ప్రస్తుతం మొక్కజొన్నకు ఆశించిన కాండం కుళ్లు తెగులు నివారణకు ఎకరానికి 4 నుంచి 5 కేజీల బ్లీజింగ్ చల్లి తగినంత నీటిని ఉంచాలని సూచించారు. శిలీంద్రం నివారణకు 2.5 మిల్లీ లీటర్ల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు.